సాక్షి
తూర్పుగోదావరి

మంగళవారం । 6 । మే । 2025



మామిడిపై 'ఈగ' దాడి

మామిడి దిగుబడులను దెబ్బ తీయడంతో పాటు కాయ నాణ్యతను పిండి పురుగులు, కాయతొలుచు పురుగులతో పాటు పండు ఈగలు దెబ్బ తీస్తున్నాయి.


8లో



మీ నిర్లక్ష్యంతో 400 మందికి నష్టం

అర్హులైన తమకు మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఫిమేల్) పదోన్నతి కల్పించడంలో ఉద్దేశపూర్వక జాప్యం తగదని సచివాలయ ఏఎన్ఎంలు ఆవేదన వ్యక్తం చేశారు.

1,981 క్యూసెక్కులు.. కడలిపాలు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం 1,981 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.05 అడుగులకు పెరిగింది. డెల్టా కాలువలకు నీటిని విడుదల చేయలేదు.

న్యూస్‌రీల్

ఆశాల సమ్మె నోటీసు



సమ్మె నోటీసు అందజేస్తున్న ఆశా వర్కర్స్ యూనియన్ నేతలు

రాజమహేంద్రవరం రూరల్: దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఈ నెల 20న తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో తాము కూడా పాల్గొంటున్నామని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో డీపీఎంఓ డాక్టర్ శ్రీవల్లికి వారు సోమవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20 సార్వత్రిక సమ్మెకు కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని తెలిపారు. కార్మిక చట్టాల స్థానంలో కేంద్రం తీసుకువస్తున్న 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వెంకటలక్ష్మి మాట్లాడుతూ, ఆశా కార్యకర్తలను కార్మికులుగా గుర్తించి, రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశా కార్యకర్తలుగా మార్చాలని, జీఓలు విడుదల చేయాలని, ప్రభుత్వమే నియమకాలు చేపట్టాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వీటి సాధన కోసం దేశవ్యాప్త సమ్మెలో ఆశా వర్కర్లందరూ పాల్గొంటారని తెలిపారు.

అసంఘటిత కార్మికులు ఈ-శ్రమ్‌లో నమోదు చేసుకోవాలి



ఈ-శ్రమ్ నమోదు చేస్తున్న ఏఎల్‌ఓ లలిత తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): అసంఘటిత కార్మికులు ఈ–శ్రమ్ పోర్టల్‌లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా సహాయ కార్మిక అధికారి (ఏఎల్‌ఓ) లలిత అన్నారు. నగరంలోని మెయిన్ రోడ్డు మోచీ వీధిలోని అబూబకర్‌షా మసీదులో సోమవారం ఉచిత నమోదు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత, ఇన్‌చార్జి కార్యదర్శి బి.పద్మ ఆదేశాల మేరకు పారా స్వచ్ఛంద సంస్థతో కలసి జిల్లా కార్మిక శాఖ ఈ కార్యక్రమం నిర్వహించింది. కేంద్ర ప్రభుత్వం అందించే వివిధ పథకాల ప్రయోజనాలు పొందేందుకు అసంఘటిత రంగ కార్మికులందరూ తప్పనిసరిగా ఈ–శ్రమ్‌లో నమోదు కావాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు జీవీవీ రమణ, వైవీ ఫణీంద్ర, పారా సంస్థ ప్రతినిధి ఎండీ అమీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ పీజీఆర్ఎస్‌కు 35 అర్జీలు



అర్జీదారుల సమస్యలు వింటున్న ఎస్పీ నరసింహ కిషోర్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెస్సల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజలు వివిధ సమస్యలపై 35 అర్జీలు సమర్పించారు. వారి నుంచి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలు స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో నేరుగా జూమ్ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి ఫిర్యాదీల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి, సత్వర న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం మురళీకృష్ణ, ఏవీ సుబ్బరాజు, స్పెషల్ బ్రాంచి డీఎస్పీ బి.రామకృష్ణ, ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ పవన్ కుమార్‌రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరదలపై నేడు సమావేశం

ధవళేశ్వరం: రానున్న గోదావరి వరదలను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు ధవళేశ్వరంలోని ఇరిగేషన్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు ఫ్లడ్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ గోపీనాథ్ సోమవారం ఈ విషయం తెలిపారు. వరదల నేపథ్యంలో తీసుకోవాల్సిన రక్షణ పనులకు సంబంధించి సమగ్ర సమాచారంతో సంబంధిత ఇరిగేషన్ అధికారులు ఈ సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

● ఆరోగ్య మంత్రి వ్యాఖ్యలు బాధించాయి

ఒంటి కాలిపై నిలుచుని సీహెచ్‌ఓల నిరసన

రాజమహేంద్రవరం రూరల్: తమనుద్దేశించి రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ చేసిన వ్యాఖ్యలు బాధించాయని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సీహెచ్‌ఓ) ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన సీహెచ్‌ఓలు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం 8వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సీహెచ్‌ఓలు కలెక్టరేట్ వద్ద ఒంటి కాలిపై నిలుచుని నిరసన తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు టి.మమత మాట్లాడుతూ, బీఎస్సీ నర్సింగ్ డిగ్రీ చదివి, ఆరు నెలల శిక్షణ పూర్తి చేసుకుని, మరో పరీక్ష రాసి, తాము ఈ విధుల్లో చేరామని చెప్పారు. వైద్యాధికారులతో సమానంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు 24 గంటలూ సేవలందిస్తున్నామన్నారు. పగలనక, రాత్రనక గర్భిణులకు సేవలందించామన్నారు. ఇంత కష్టపడుతున్న తమ సేవలను కించపరుస్తూ మంత్రి వ్యాఖ్యానించడం బాధించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కావాలంటే గ్రామాల్లో సర్వే చేయించి నిజానిజాలు తెలుసుకుని తమ సమస్యలను పరిష్కరించాలని మంత్రి సత్యకుమార్‌ను డిమాండ్ చేశారు. ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న సీహెచ్‌ఓలను క్రమబద్ధీకరించాలని, విలేజ్ క్లినిక్ అద్దె బకాయిలు, విద్యుత్ బిల్లులు వెంటనే చెల్లించాలని, న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యేంత వరకూ నిరవధిక సమ్మె కొనసాగుతుందని మమత స్పష్టం చేశారు.



ఒంటి కాలిపై నిల్చొని నిరసన తెలుపుతున్న సీహెచ్‌ఓలు

పింఛన్.. వంచన

- విితంతు పింఛన్ల అర్థం మార్చిన కూటమి ప్రభుత్వం
- పింఛన్ తీసుకుంటూ భర్త మృతి చెందితేనే భార్యకు వితంతు పింఛను
- భర్త చనిపోయిన వెంటనే మంజూరుకు ససేమిరా
- ఇదేం నిబంధనంటూ ప్రజల నిట్టూర్పు
- కొత్త పింఛన్ల ఊసెత్తని సర్కారు
- జిల్లా వ్యాప్తంగా 10 వేల మందికి పైగా నిరీక్షణ



చాగల్లు మండలం బ్రాహ్మణగూడెంలో పింఛన్లు అందజేస్తున్న సచివాలయ ఉద్యోగిని (ఫైల్)

సాక్షి, రాజమహేంద్రవరం: అభాగ్యులపై కూటమి ప్రభుత్వం 'పచ్చ'పాతం చూపుతోంది. కుటుంబ పెద్ద (భర్త) మృతి చెందితే ఆ కుటుంబానికి ఆర్థిక ఆసరా కల్పించే వితంతు పింఛను మంజూరులోనూ కర్కశంగా వ్యవహరిస్తోంది. వితంతు పింఛను మంజూరుకు కొత్త నిబంధనలు తెర పైకి తెచ్చింది. భర్త ఏదైనా పింఛను పొందుతూ మరణిస్తే ఆ పింఛనును భార్యకు వితంతు పింఛనుగా అందించేలా మార్గదర్శకాలు అమలు చేస్తోంది. ఇందులో భాగంగానే పింఛన్ పొందుతూ మృతి చెందిన వారి భార్యలు సుమారు 1,140 మందికి కొత్తగా పింఛన్లు అందించారు. మిగిలిన వారి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. వారికి నిరీక్షణ తప్పడం లేదు. గతంలో ఎన్నడూ లేని నిబంధన తీసుకురావడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఇదేం నిబంధనంటూ నిట్టూరుస్తున్నారు. ఇలాగైతే కొత్త పింఛన్లు అందుతాయా అనే మీమాంస ప్రజల్లో నెలకొంది.

స్పౌజ్ కోటాలో మాత్రమే..

వితంతు పింఛను మంజూరులో కూటమి సర్కారు కొత్త తరహా నిబంధనలు అమలు చేస్తోంది. 2023 నవంబరు తర్వాత చనిపోయిన పింఛన్ లబ్ధిదారుల భార్యలకు మాత్రమే స్పౌజ్ కోటాలో పింఛన్లు అందజేయాలని నిర్ణయించింది. ఆ దిశగా అధికారులు అన్వేషణ చేపట్టి, జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ 1,140 మందికి మాత్రమే మంజూరు చేశారు. ఇదిలా ఉండగా వితంతు పింఛను కావాలంటూ కొత్తగా వచ్చిన దరఖాస్తులు 3 వేలకు పైగా ఉన్నట్లు అంచనా. ప్రభుత్వ నిర్ణయంతో వీరందరూ పింఛనుకు దూరం కానున్నారు. భర్త చనిపోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న వితంతువులను ఆదుకోవాల్సిన కూటమి ప్రభుత్వం నిబంధలు పెట్టి, వారికి పింఛన్లు అందించకపోవడం ఎంత వరకూ సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు.

కొత్త పింఛన్ల మాటేమిటో?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా కొత్త పింఛను దరఖాస్తులు తీసుకోవడమే తప్ప.. ఎప్పుడు మంజూరు చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రతి వారం కలెక్టరేట్‌లో నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమానికి వెళ్లి అర్జీలు ఇవ్వడం.. వెనుదిరిగి రావడం మినహా చేసేది లేక ప్రజలు మిన్నకుండిపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 10 వేల మందికి పైగా ప్రజలు పింఛన్లు మంజూరు చేయాలని ఎంపీడీఓ కార్యాలయాలు, గ్రీవెన్స్‌లో దరఖాస్తులు చేసుకున్నట్లు సమాచారం. వీరికి పింఛన్ ఎప్పుడు అందుతుందో అంతు చిక్కని ప్రశ్నగా మారింది.

50 ఏళ్లకే పింఛన్ హామీ ఏమైందో?

కూటమి ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీలకు 50 ఏళ్లకే పింఛను మంజూరు చేస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు కావస్తున్నా ఈ హామీపై నేటికీ అతీగతి లేదు. అసలు ఇస్తారా.. లేదా.. అన్న విషయమై స్పష్టత కరువైంది. జిల్లా వ్యాప్తంగా 50 ఏళ్ల వయసున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లింలు సుమారు 2 లక్షల మంది ఉంటారు. వీరందరూ హామీ అమలు కోసం నిరీక్షిస్తున్నారు.

జిల్లాలో ప్రస్తుత పింఛన్ల వివరాలు

మొత్తం పింఛన్లు	2,34,576
వృద్ధులు	1,12,921
వితంతువులు	65,032
చేనేత కార్మికులు	1,276
మత్స్యకారులు	1,854
ఒంటరి మహిళ	9,047
దివ్యాంగులు	32,073
వీరికి ప్రతి నెలా అందిస్తున్న మొత్తం	రూ.102 కోట్లు

మండలాల వారీగా వితంతు పింఛన్ల వివరాలు

అనపర్తి	2,852
బిక్కవోలు	2,535
చాగల్లు	2,271
దేవరపల్లి	2,838
గోకవరం	3,040
గోపాలపురం	2,281
కడియం	3,648
కోరుకొండ	3,364
కొవ్వూరు	2,472
కొవ్వూరు (అర్బన్)	1,268
నల్లజర్ల	3,117
నిడదవోలు	2,324
నిడదవోలు (అర్బన్)	1,213
పెరవలి	2,051
రాజమహేంద్రవరం అర్బన్	10,067
రాజమహేంద్రవరం రూరల్	6,731
రాజానగరం	4,305
రంగంపేట	1,967
సీతానగరం	2,656
తాళ్లపూడి	1,751
ఉండ్రాజవరం	2,281

గత ప్రభుత్వ హయాంలో..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అర్హతే ప్రామాణికంగా కొత్త పింఛన్లు మంజూరు చేసేవారు. మధ్యవర్తులు, దళారులతో పని లేకుండా దరఖాస్తు చేసుకున్న వెంటనే పరిశీలన జరిపి, అర్హతలు ఉంటే పింఛన్లు అందించే వారు. ఏటా జనవరి, జూలై నెలల్లో కొత్తవి అందజేసేవారు. రాజకీయాలకు అతీతంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే చాలు మంజూరయ్యేవి.

పీజీఆర్ఎస్‌కు 176 అర్జీలు



పీజీఆర్ఎస్‌లో వృద్ధురాలి సమస్య వింటున్న కలెక్టర్ ప్రశాంతి. చిత్రంలో జేసీ చిన్నరాముడు తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజలు 176 అర్జీలు సమర్పించారు. వారి నుంచి కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులనుద్దేశించి మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో అలసత్వం ఉండరాదని, అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కార విధానం ఉండాలని అన్నారు. నిర్లక్ష్య వైఖరిని ఉపేక్షించబోమని హెచ్చరించారు. సమస్య పరిష్కారం కాలేదంటూ ప్రజలు మళ్లీ మళ్లీ తన వద్దకు వస్తే దానిని సంబంధిత అధికారి నిర్లక్ష్యంగా పరిగణిస్తానని స్పష్టం చేశారు. కొన్ని సందర్భాల్లో జిల్లా స్థాయి అధికారుల కంటే సచివాలయ ఉద్యోగులే మెరుగ్గా ఎండార్స్‌మెంట్ ఇస్తున్నారని అన్నారు. సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలన్నారు. కింది స్థాయి ఉద్యోగులు ఎలాంటి పరిష్కారం చూపారో చూడాల్సిన బాధ్యత జిల్లా అధికారులపై ఉందన్నారు. పీజీఆర్ఎస్‌కు కొందరు అధికారులు గైర్హాజరవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రం విడిచి వెళ్లాలంటే తప్పనిసరిగా అనుమతి ఉండాలని, ఇక నుంచి అందరూ ఈ–ఆఫీస్ ద్వారా సెలవు వివరాలు తెలియజేసి, ముందస్తు అనుమతి పొందాలని కలెక్టర్ ఆదేశించారు. ఏదైనా అర్జీ పరిష్కరించడం సాధ్యం కాదని తెలిస్తే, అందుకు కారణాలను కూడా వివరించాలని చెప్పారు.

జిల్లాలో 28.8 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం

కొవ్వూరు: జిల్లావ్యాప్తంగా సోమవారం ఉదయం 8.30 గంటలతో ముగిసిన 24 గంటల వ్యవధిలో 28.8 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. పశ్చిమ బెంగాల్ నుంచి ఒడిశా తీరం మీదుగా ఉత్తర కోస్తా వరకూ ఉపరితల ఆవర్తనం ఆవరించడంతో కొద్ది రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని, గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. దీంతో జిల్లాలో ప్రధానంగా అరటి, కొబ్బరి, మామిడి, జీడిమామిడి, కూరగాయల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వరి రైతుల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. ధాన్యం ఎక్కడికక్కడే కళ్లాల్లో, రోడ్ల పక్కన, చేలల్లో ఉండిపోయింది. తేమ శాతం తగ్గించేందుకు పలువురు రైతులు ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టుకుంటున్నారు. ఈ తరుణంలో మారిన వాతావరణ పరిస్థితులు వారికి కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా వర్షపాతం వివరాలు.. తాళ్లపూడి గరిష్ఠంగా 69.6 మిల్లీమీటర్లు. కొవ్వూరు 61.8, దేవరపల్లి 53.2, కోరుకొండ 44.4, గోకవరం 44.2, సీతానగరం 30, నల్లజర్ల 27.6, రాజమహేంద్రవరం అర్బన్ 26.8, చాగల్లు 26.2, బిక్కవోలు 22.4, రంగంపేట 20, గోపాలపురం, రాజమహేంద్రవరం రూరల్ 19.6, రాజానగరం 18.4, అనపర్తి 17.2, ఉండ్రాజవరం 16.2, నిడదవోలు 13.4, పెరవలి 9, కడియం 8.2 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా మంగళవారం కూడా భారీ వర్షం కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలు అన్నదాతల గుండెల్లో గుబులు రేపుతున్నాయి. ఇప్పటికే రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో నష్టం వాటిల్లిందని, మళ్లీ భారీ వర్షాలు కురిస్తే నష్ట తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంటుందని వారు కలత చెందుతున్నారు.

నేడు ముస్లింల చలో రాజమండ్రి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా అనేక ముస్లిం వ్యతిరేక చట్టాలు చేస్తోందని ముస్లిం ఐక్యవేదిక నాయకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఉన్న 1995 వక్ఫ్ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ, అభివృద్ధి పేరుతో నల్ల చట్టాన్ని తయారు చేసి, హడావుడిగా ఆమోదించారన్నారు. ప్రతిపక్షాల వాదనలను, ముస్లిం సమాజ అభ్యంతరాలను ఏమాత్రం పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ఈ వక్ఫ్ సవరణ చట్టం అమలు చేయకూడదని, వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ముస్లింలు నిరసనలు తెలుపుతున్నారని పేర్కొన్నారు. ఇందులో భాగంగా మంగళవారం 'చలో రాజమండ్రి' నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా రాజమహేంద్రవరం ఆజాద్ చౌక్ నుంచి ఉదయం 9 గంటలకు ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ జరుగుతుందని తెలిపారు

అన్నదాతల ఆగ్రహం



రోడ్డుపై బైఠాయించి, నినాదాలు చేస్తున్న రైతులు

- మొత్తం ధాన్యం కొనాలని డిమాండ్
- సమిశ్రగూడెం బ్రిడ్జి వద్ద ధర్నా

నిడదవోలు రూరల్: రబీలో పండించిన మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ అన్నదాతలు సోమవారం సాయంత్రం రోడ్డెక్కారు. రైతు సేవా కేంద్రాల (ఆర్‌ఎస్‌కే) ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని పెంచాలని డిమాండ్ చేస్తూ పరిసర గ్రామాలకు చెందిన రైతులు నిడదవోలు మండలం సమిశ్రగూడెం బ్రిడ్జి వద్ద ధర్నా నిర్వహించారు. ఇప్పటికే అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోయి తీవ్రంగా నష్టపోయామని, పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా ప్రభుత్వం తమను ముప్పుతిప్పలు పెడుతోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమిశ్రగూడెం ఆర్‌ఎస్‌కే–2 పరిధిలో 2,157 ఎకరాల్లో రబీ సాగు చేయగా ఇంకా 1,700 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని తెలిపారు. ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని రెండు రోజులుగా ఫోన్ చేసినా రెవెన్యూ, వ్యవసాయ, సివిల్ సప్లైస్ అధికారులు కనీసం స్పందించడం లేదని మండిపడ్డారు. ప్రతి గింజా కొంటామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు వచ్చి స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకూ ఆందోళన విరమించేది లేదని ముక్తకంఠంతో నినదించారు. తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ, ఎస్సై కె.వీరబాబు అక్కడకు చేరుకుని రైతులతో మాట్లాడారు. మంగళవారం నుంచి ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ ఆందోళనలో రైతులు బూరుగుపల్లి జానకీరామయ్య, కస్తూరి విద్యాసాగర్, కొత్తపల్లి సత్యనారాయణ, కాల్దారి శ్రీను, గూడపాటి లక్ష్మీచౌదరి, బూరుగుపల్లి చిట్టియ్య, ఏలూరు జనార్దన్, కొఠారు కిషోర్, కొల్లి రాజు, తిరుమళ్ల రాముడు తదితరులు పాల్గొన్నారు.



రైతుల ధర్నాతో నిలిచిన ట్రాఫిక్

సహజ వనరులు దోచేస్తున్నారు

- కూటమి నాయకులపై వైఎస్సార్ సీపీ నేత చెల్లుబోయిన వేణు ఆరోపణ
- గోదావరి లంకల్లో అక్రమ తవ్వకాల పరిశీలన



అక్రమ తవ్వకాల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి వేణు తదితరులు

కడియం: సహజ వనరులైన ఇసుక, మట్టిని కూటమి నాయకులు దోచేస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆరోపించారు. కడియపులంక శివార్లలోని గోదావరి లంకల్లో ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాలను సోమవారం పరిశీలించారు. అనంతరం, అక్కడే స్థానిక విలేకర్లతో మాట్లాడారు. జింకలకు ఆవాసంగా ఉన్న లంక భూముల్లో ఇసుక, మట్టి అక్రమంగా తవ్వేస్తున్నారంటూ ప్రస్తుత మంత్రి కందుల దుర్గేష్ గతంలో ఆరోపించారని అన్నారు. కానీ ఇప్పుడు వారి కూటమి నాయకులే 60–40 వాటాలతో అదేచోట తవ్వకాలు సాగిస్తుంటే ఆయనకు, స్థానిక ఎమ్మెల్యేకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కేవలం సాగుకు మాత్రమే అవకాశమున్న భూముల్లో వందలాది లారీల మట్టిని అక్రమంగా తవ్వేసి, కూటమి నాయకులు సొమ్ము చేసుకుంటున్నారని అన్నారు. ఫోర్జరీ అనుమతులు చూపించి, మట్టి దోచుకుపోతూంటే అధికార యంత్రాంగం కళ్లు మూసుకుంటోందని విమర్శించారు. రివర్ కన్జర్వేటరీ, అక్రమ మైనింగ్ చట్టాలతో పాటు ఫోర్జరీ అనుమతులు చూపినందుకు కూడా అక్రమార్కులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోకపోతే సంబంధిత అధికార యంత్రాంగంపై న్యాయపరమైన చర్యలకు తాము సిద్ధమని హెచ్చరించారు. తమ పరిధిలోది కాదని చేతులు దులిపేసుకుంటున్న అధికారులు, అక్రమ రవాణాపై కనీసం చర్యలు కూడా తీసుకోకపోవడం దారుణమన్నారు. అలాగే, లబ్ధిదారుల పేరిట అక్రమంగా ఇసుక తవ్వి, ట్రాక్టర్లపై తరలిస్తున్నారని, ఒక్కో ట్రాక్టర్‌కు రూ.600 వసూలు చేస్తున్నారని, ఇందులో కూలీలకు రూ.300 ఇచ్చి, కూటమి నాయకులు రూ.300 దోచుకుంటున్నారని వేణు ఆరోపించారు. ఈవిధంగా ప్రతి రోజూ వెయ్యి ట్రాక్టర్లకు పైగా ఇసుకను తరలించి డబ్బులు చేసుకుంటున్నారన్నారు. చంద్రబాబు ఏ పథకం ప్రవేశపెట్టినా వారి నాయకులు, వారి కార్యకర్తలకు మాత్రమే ప్రయోజనం చేకూరే విధంగా చేస్తున్నారని విమర్శించారు. నిజమైన లబ్ధిదారుకు ఉచితంగా ఇసుక అందడం లేదన్నారు. కూటమి నాయకులే వందలాది ట్రాక్టర్లతో ఇసుక తరలించి, లారీల్లోకి ఎగుమతి చేసి, ఇతర ప్రాంతాలకు తరలించి అమ్ముకుంటున్నారని అన్నారు. నిజమైన లబ్ధిదారు ఇసుక ర్యాంపునకు వస్తే చుక్కలు చూపిస్తున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి ప్రమేయం లేకుండా ఇది జరుగుతుందా అని వేణు ప్రశ్నించారు. అధికారులు కూడా ఇందులో భాగస్వాములుగా ఉన్నారా.. అందుకే చర్యలు తీసుకోవడం లేదా అని నిలదీశారు. ఇసుక తీసుకు వెళుతున్న వారు నిజంగా ఇల్లు కట్టుకునేందుకే తీసుకు వెళుతున్నారా అనే విషయాన్ని నిర్ధారించేందుకు తమ పార్టీ చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు మాట్లాడుతూ, గోదావరి లంక మట్టిని అక్రమార్కుల పరం చేసే కంటే, కడియం నర్సరీ రైతులకు అందజేస్తే ఎక్కువ మేలు జరుగుతుందని అన్నారు. అటువంటి ఆలోచన చేయకుండా అక్రమంగా దోచుకోవడానికే ప్రాధాన్యం ఇవ్వడం దారుణమన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ మాట్లాడుతూ, కష్టపడే కూలీలకు చెందాల్సిన సొమ్మును కూడా కూటమి నాయకులు కొల్లగొట్టుకుపోవడం దారుణమన్నారు. రెవెన్యూ, పోలీసు యంత్రాంగానికి అన్ని ఆధారాలతో ఫిర్యాదు చేసినా కూడా స్పందించడం లేదన్నారు. ఇక్కడ జరిగే అన్యాయాన్ని ప్రశ్నించే వారిని కూడా చంపుతామంటూ బెదిరింపులకు దిగుతున్నారని అన్నారు.

క్లుప్తంగా

గోకులంలో బెల్ట్‌షాపు!



పిఠాపురం మండలం రాపర్తిలో గోకులం షెడ్డులో ఏర్పాటు చేసిన మద్యం షాపు

పిఠాపురం: కిల్లీ కొట్టు, కిరాణా కొట్టు అది ఇదీ అని కాదు ఎక్కడ చూసినా బ్రాందీ బెల్టు షాపులే. కూటమి ప్రభుత్వం వచ్చాక మద్యం ఏరులై పారుతున్నదనడానికి ప్రతీ గ్రామం లోను ఇవి ప్రత్యక్ష సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. చివరకు గోవులను సంరక్షించడానికి ప్రభుత్వ నిధులతో నిర్మించిన గోకులంను సైతం వదలలేదు కూటమి నేతలు. పిఠాపురం మండలం రాపర్తిలో గోవుల కోసం నిర్మించిన గోకులంలో బ్రాందీ షాపు ఏర్పాటు చేయడం చూసిన స్థానికులు మరీ ఇంత దారుణమా? మూగజీవాలు ఉండాల్సిన చోట మద్యం షాపు ఏమిటంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. బ్రాందీషాపు అంటూ బోర్డు పెట్టి మరీ విచ్చలవిడిగా మద్యం అమ్ముతున్నప్పటికీ అది లైసెన్సు ఉన్న బ్రాందీ షాపు కాకుండా బెల్టుషాపు కావడం కొసమెరుపు.

మద్యం తాగి బైక్ నడిపిన వారికి జైలు

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో 8 మందికి రెండు రోజుల చొప్పున జైలు, 9 మందికి రూ. 10 వేల చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్-1, 2 పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. సోమవారం కోర్టులో 17 మందిని హాజరుపర్చగా వారికి పై విధంగా జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

మామిడిపై ఈగ దాడి

- నాణ్యతను దెబ్బతీస్తున్న వైనం
- జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచన

పిఠాపురం: ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన మామిడి పండ్ల సీజన్ వచ్చేసింది. ఈ ఏడాది ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో మామిడి పూత కాస్త ఆలస్యం అయ్యింది. దీని ప్రభావం మామిడి దిగుబడిపై చూపుతుండగా దిగుబడులతో పాటు కాయ నాణ్యతను దెబ్బతీసే వాటిలో పిండిపురుగులు, కాయతొల్చు పురుగులు, పండుఈగలు ఉన్నాయి. వీటిలో పండుఈగ పంటకు అపార నష్టాలను కలుగజేస్తుంది. పండుఈగ సుమారు 60 శాతం పంటను నాశనం చేస్తుంది. ఎండాకాలం ఎప్పుడు వస్తుందా ఎప్పుడెప్పుడు మధురమైన మామిడి కాయల రుచి ఆస్వాదిద్దామా అని అందరూ ఎదురు చూస్తుంటారు. రకం ఏదైనా మామిడి రుచి ప్రత్యేకమైనదే. అటువంటి మామిడి కాయలకు కొన్నేళ్లుగా పండు ఈగ రూపంలో పెద్ద కష్టం వచ్చిపడింది. కాయ చూడడానికి పైకి బాగానే కనిపిస్తుంది. తీరా మాగ వేసి పండిస్తే కుళ్లు కనిపిస్తుంది. దాని లోపల చూస్తే బియ్యపు గింజ పరిమాణంలో తెల్లటి పురుగులు కనిపిస్తుంటాయి. ఒకప్పుడు కాపు దశలో వర్షాలు పడ్డ సందర్భాల లోనే ఇవి కనిపించేవి. కానీ కొన్నేళ్లుగా పండుఈగ నష్టం రివాజుగా మారింది. అన్ని ప్రాంతాల్లోనూ ఈ పండు ఈగ కనిపిస్తున్నప్పటికి కాకినాడ జిల్లాలో 18,409.23 హెక్టార్లలో మామిడి పంట సాగవుతుండగా ప్రస్తుతం ఈ పండు ఈగ దాడి పెరగనున్నట్లు ఉద్యానవన శాఖ అధికారులు రైతులను హెచ్చరిస్తున్నారు. ఇది వ్యాపిస్తే నష్టం అపారంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. పండుఈగ తన సంతతిని పెంచుకుని తోటల్లో మాటు వేసి ఉన్నట్లు గుర్తించారు. పండుఈగ సోకితే మామిడి నాణ్యత పూర్తిగా దెబ్బతిని రాబడి పడిపోయి రైతు తీవ్రంగా నష్టపోయే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం మామిడి సీజన్ కావడంతో మే, జూన్ నెలల్లో ఎక్కువగా సోకి మామిడి పండ్లకు నష్టం కలిగించే పండు ఈగ పట్ల రైతులు అప్రమత్తగా ఉండాలని పిఠాపురం ఉద్యానవన శాఖాధికారిణి కేఎస్ శైలజ సూచిస్తున్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్ అమ్మకాలు ఉన్నందున నాణ్యత దెబ్బతినకుండా ఉండాలంటే పండు ఈగ పట్ల జాగ్రత్తలు పాటించాలని ఆమె సూచిస్తున్నారు.



మామిడి తోటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్న అధికారులు



పండు ఈగ నుంచి రక్షణగా ఏర్పాటు చేసే లింగాకర్షక బుట్టలు



పండు ఈగలు

ఎగుమతులపైనా ప్రభావం

ఈగల దాడి వల్ల మామిడి పండు నాణ్యత తగ్గిపోతుండడంతో ఎగుమతులపైనా తీవ్ర ప్రభావం పడుతోందని రైతులు అంటున్నారు. మామిడి సీజన్‌లో జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకు ఇతర దేశాలకు మామిడి పండ్లు ఎగుమతి అవుతుంటాయి.

కానీ ప్రస్తుతం పండుఈగ సోకడం వల్ల పండు లోపల పురుగులు కనిపిస్తుండడంతో వ్యాపారులు కొనుగోళ్లను నిలిపివేస్తున్నారని రైతులు చెబుతున్నారు. తద్వారా ఎగుమతి లేక ధర పతనం అయ్యి పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఎదురయ్యిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాలిన పండ్ల వల్లే పండు ఈగ దాడి పెరుగుతుంది

మామిడి తోటల్లో నేల మీద పడిన పండ్లను అలాగే వదిలేస్తే పండు ఈగ విపరీతంగా పెరుగుతుంది. దీనికి తోడు ప్రస్తుతం వర్షాలు ఈదురు గాలులతో మామిడి కాయలు భారీగా నేల రాలుతున్నాయి. అలా నేల మీద వదిలేసి పండ్లను పండుఈగలు తమ సంతతిని వృద్ధి చేసుకోడానికి వేదికగా వాడుకుంటాయి. తద్వారా విపరీతంగా పండు ఈగలు పెరిగి చెట్లకు ఉన్న కాయలపైనా గుడ్లు పొదుగుతాయి దీంతో కాయ బయటకు బాగా కనిపించినా లోపల పండు తయారయ్యాకా పురుగులు కనినిపిస్తుంటాయి. పండు ఈగ జామ తోటల్లో ఎక్కువగా ఉంటుంది. అందుకని పక్కన జామ తోటలు ఉన్న ప్రాంతాల్లో మామిడి తోటలు ఉన్న రైతులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి. జామ తోటల సీజన్ ముగియగానే ఆ ఈగలు మామిడి తోటలపై దాడి చేస్తుంటాయి.

ముందు జాగ్రత్తలే మేలు



ముందు జాగ్రత్త చర్యలతోనే ఈగను గుర్తించి నివారించుకోవాలి. వచ్చిన తరువాత నివారించడం ఇబ్బందిగా మారుతుంది. ఎప్పటికప్పుడు మామిడి తోటల్లో రాలిన కాయలు, పండ్లను వెంటనే తీసి వాటిని దూరంగా ఒక గొయ్యి తీసి పాతి పెట్టుకోవాలి. లింగాకర్షక బుట్టలు (పెరిమోన్ ట్రాప్స్) తోటల్లో ఏర్పాటు చేసుకోవాలి. సుమారుగా ఎకరానికి 5 నుంచి 6 బుట్టలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా పండుఈగ ఉధృతిని తగ్గించి, నివారణ చర్యలు తీసుకోవడానికి వీలు కలుగుతుంది. లింగాకర్ష బుట్టలలో 4 ఈగలు పడితే కచ్చితంగా ఈగ ఉధృతి ఉన్నట్లు గుర్తించాలి. దీని నివారణకు పులిసిన కల్లు కానీ, మలాతియాన్ కానీ రెండు మిల్లీలీటర్లు కలిపి కొద్దిగా బెల్లం వేసి ఉంచాలి. అది పులిసి ఒక రకమైన వాసన వస్తుంది. దానిలో ఏదైనా పండ్ల రసం కలిపి ఆ మిశ్రమాన్ని మట్టి పాత్రలలో తోటల్లో అక్కడక్కడా పెట్టాలి. దానికి పండుఈగ అధికంగా ఆకర్షితమై వచ్చి ఆ రసం పీల్చగానే చనిపోతుంది. ఈ విధానం వల్ల రసాయనాలు ఉపయోగించకుండా సేంద్రియ పద్ధతిలో ఈగను నివారించవచ్చు. ఇంకా ఈగ ఉధృతి ఎక్కువగా ఉంటే ఒక లీటరు నీటికి రెండు మిల్లీలీటర్లు మలాతియాన్ కలిపి తోటల్లో పిచికారీ చేసుకోవాలి. కాయలకు కవర్లు ఏర్పాటు చేయడం ద్వారా ఈగ ఉధృతిని తగ్గించుకోవచ్చు గాని కవర్లు కొన్ని రోజులు ఉంచి తీసేయకూడదు. అలా తీయడం వల్ల ఈగ దాడి చేసే అవకాశం ఉంది. కాయను పూర్తిగా కోయవలసి వచ్చినప్పుడు మాత్రమే కవర్లు తీయాలి. కవరు తీసిన కాయలను చెట్టుకు ఉంచ కూడదు.

కె.సత్య శైలజ, ఉద్యాన శాఖాధికారిణి, పిఠాపురం

రూ.10 కోట్ల విలువైన భూమిని కాపాడండి

- ఒకటో డివిజన్‌లో ఆక్రమిత స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలి
- కలెక్టర్‌కు మాజీ ఎంపీ భరత్ ఫిర్యాదు

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): కార్పొరేషన్ పరిధిలో లాలాచెరువు వద్దగల సాయిదుర్గానగర్‌లో దాదాపు రూ.10కోట్ల విలువైన 1,300 గజాల స్థలాన్ని కొందరు వ్యక్తులు మాఫియాగా ఏర్పడి కాజేస్తున్నందున ప్రభుత్వం దృష్టి సారించి ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ విజ్ఞప్తి చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కి ఆయన ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 186-1, ఏరియాలో ప్లాట్లుగా విభజించిన సమీప డోర్ నంబర్ 72-16-1/2 వద్ద ప్లాటు నంబర్ 30లో 524 చదరపు గజాల ప్లాటు, నంబర్ 9లో 406 చదరపు గజాల ప్లాటు, నంబర్ 10లో 387 చదరపు గజాలు మొత్తం 1317 చదరపు గజాల స్థలాన్ని ఆక్రమించారని భరత్ విజ్ఞాపన పత్రంలో పేర్కొన్నారు. ఇది కార్పొరేషన్‌కి వదిలిన పార్కుకు సంబంధించిన స్థలం అని అయితే కొందరు వ్యక్తులు దీనికి సంబంధించిన దస్తావేజు నకళ్లను తీసి దానికి వారసులుగా విజయనగరం జిల్లా, గంట్యాడ మండలం, రామవరంలో ఓ మహిళకి గిఫ్ట్ వచ్చినట్లు నకిలీ డాక్యుమెంట్ పుట్టించి విజయనగరం జిల్లాలో రిజిస్టర్ చేయించారని ఆయన వివరించారు. కానీ ఈ నంబర్లు రాజమహేంద్రవరం రిజిస్టర్ ఆఫీసులో నమోదు కాలేదని, మున్సిపల్ కార్పొరేషన్లో ఖాళీ స్థలం పన్ను కూడా వేయించారని భరత్ పేర్కొన్నారు. పదికోట్ల రూపాయల విలువైన భూమిని కాజెయ్యడానికి మాఫీయా చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని ఆయన కోరారు. పక్కాగా ఉన్న ఆధారాలన్నీ పూర్తిగా పరిశీలించి, ఈ రిజిస్ట్రేషన్లను రద్దు చేసి, మున్సిపల్ కార్పొరేషన్‌కి సంబంధించిన పార్కు సలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ఆయన కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఖాళీస్థలాలు, ప్రభుత్వ స్థలాలు కనిపిస్తే చాలు భూ మాఫియా పేట్రేగిపోతోందని విమర్శించారు.



కలెక్టర్ ప్రశాంతికి వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎంపీ భరత్‌రామ్

సార్వత్రిక సమ్మెలో మేము సైతం



సార్వత్రిక సమ్మె పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూనియన్ నేతలు

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

రాజమహేంద్రవరం రూరల్: దేశవ్యాప్తంగా ఈ నెల 20వ తేదీన చేయబోయే సార్వత్రిక సమ్మెలో ఎల్‌ఐసీ క్లాస్-3, క్లాస్-4 ఉద్యోగులు 50వేలమంది భాగస్వామ్యం అవుతున్నారని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ రాజమహేంద్రవరం డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్ తెలిపారు. సోమవారం మోరంపూడి ఎల్‌ఐసీ రాజమహేంద్రవరం డివిజనల్ కార్యాలయంలో భోజన విరామ సమయంలో సార్వత్రిక సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన, యూనియన్ అధ్యక్షుడు ఎస్ఆర్‌జే మాథ్యూస్, నాయకులు ఆవిష్కరించారు. కోదండరామ్, మాథ్యూస్ మాట్లాడుతూ నేషనల్ కన్వెన్షన్ ఆఫ్ వర్కర్స్ ఇచ్చిన పిలుపు మేరకు ఎల్‌ఐసీలో అతి పెద్ద సంఘం అయిన ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఈ సమ్మెలో పాల్గొంటుందన్నారు. ఈ సమ్మెలో ఇన్సూరెన్స్ రంగానికి సంబంధించిన ముఖ్యమైన సమస్యలను కూడా పరిష్కరించాలని కోరుతూ పాల్గొంటున్నామన్నారు. బీమా పాలసీలపై జీఎస్టీ రద్దు చేయాలని, ఎల్‌ఐసీలో ఖాళీగా ఉన్న క్లాస్ 3, 4 ఉద్యోగాల భర్తీ వెంటనే చేపట్టాలని, నూతన పెన్షన్ పథకం రద్దు చేసి, ఎల్‌ఐసీలో ఉన్న ఉద్యోగులు అందరికీ 1995 పెన్షన్ పథకం అమలు చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సాధారణ బీమా కంపెనీలను ఒకే కంపెనీగా చేయాలని, కనీస వేతనం రూ.26,000 అందరికీ ఇవ్వాలనే ప్రధాన డిమాండ్‌తో ఈ సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. మహిళా కన్వీనర్ శిరీష, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ప్రధాన కార్యదర్శి సమ్మతం గనెయ్య, ఓబీసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్, అధ్యక్షుడు బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 - 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 - 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	22,000
గటగట (వెయ్యి)	18,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	17,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 - 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 - 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

రైతులకు అండగా ఉండండి

అధికారులతో మంత్రి మనోహర్

కాకినాడ సిటీ: అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు అండగా నిలవాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మిల్లర్లు, అధికారులను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో మంత్రి కాకినాడ, బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల ప్రజాప్రతినిధులు, జాయింట్ కలెక్టర్లు, రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ ఆదివారం కురిసిన వర్షాల వల్ల ధాన్యం తడిసి రైతులు ఆందోళన చెందుతున్న విషయాన్ని వివరించారు. కాకినాడ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రగతిని జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా వివరించినప్పుడు ట్రాన్స్‌పోర్టు కోసం ఉపయోగించే ట్రైలర్ల సర్టిఫికేషన్‌కు తీవ్ర జాప్యం జరుగుతోందని ఎమ్మెల్యేలు తెలిపారు. రవాణాశాఖ అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని కలెక్టర్ షణ్మోహన్ వివరించారు. బొండాలు రకం బాయిల్డ్‌రైస్ సేకరణకు ఎఫ్‌సీఐ అనుమతి కోరామన్నారు. అనుమతి వచ్చే లోపు కొనుగోళ్లు కొనసాగించాలని పౌరసరఫరా సంస్థ ఎండీ మనజీర్ జిలానిసామూల్ మిల్లర్లను కోరారు. ఎఫ్‌సీఐలో మాన్యువల్ గ్రెయిన్ ఎనాలసిస్ వల్ల రిజెక్షన్ ఎక్కువగా ఉంటున్నందున ఆటోమేటిక్ అనాలసిస్ అమలు చేసేలా చూడాలని కోరారు. కోనసీమ జిల్లా సమీక్షలో వివిధ మండలాల్లో పంట కోతల సమయాల్లో తేడాలు ఉన్నందున రైతు సేవా కేంద్రాల టార్గెట్‌లను అడ్జస్ట్ చేయాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కోరగా గతంలో ఉమ్మడి జిల్లాలో కొనుగోలు నిర్వహించిన డ్వాక్రా సంఘాలకు పెండింగ్ ఉన్న సుమారు. రూ.16.75 లక్షల కమీషన్ చెల్లింపునకు సంబంధించి మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కోరారు. గోకవరం మండలంలో రైస్ మిల్లులు లేవని, కొనుగోళ్లకు ప్రత్యేక ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కోరారు. మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రైతులు నష్టపోకుండా తడిసిన ధాన్యం అంతా కొనుగోలు చేస్తామన్నారు. ధాన్యం నెమ్ము 22 శాతం వరకూ ఉన్నా కొనుగోళ్లు జరపాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అన్ని జిల్లాల్లో ఇకపై బ్యాంకు గ్యారంటీని ప్రామాణికంగా 1:2 నిష్పత్తిగా అమలు చేస్తామని మంత్రి నాదెండ్ల తెలియజేశారు. మూడు జిల్లాల్లో సీఎంఆర్ టార్గెట్‌ను పెంచామని చెప్పారు. కాకినాడ జిల్లాకు 50 వేల టన్నులు బొండాల రకం, బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు లక్ష టన్నులు, తూర్పుగోదావరి జిల్లాకు ఇప్పటికే పెంచిన 30 వేలకు అదనంగా మరో 50వేల టన్నులు టార్గెట్‌ను పెంచుతున్నామని మంత్రి వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మనోహర్

మీ నిర్లక్ష్యంతో 400 మందికి నష్టం

- కోర్టు సాకుతో తప్పించుకోవద్దు
- స్పందనలో సచివాలయ ఏఎన్‌ఎంల ఆవేదన

కాకినాడ క్రైం: అర్హులైన తమకు ఎంపీహెచ్ఏఎఫ్ (మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ ఫీమేల్)గా పదోన్నతి కల్పించడంలో ఉద్దేశ పూర్వక జాప్యం తగదని సచివాలయ ఏఎన్ఎంలు ఆవేదన వ్యక్తం చేశారు. నలుగురి కోసం నాలుగొందల మంది భవితకు చేటు చేయవద్దని అధికారులను వేడుకున్నారు. ఈ మేరకు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఏఎన్ఎంలు సోమవారం కాకినాడ కలెక్టరేట్‌కు వచ్చి స్పందన కార్యక్రమంలో తమ ఆవేదనను వెళ్లగక్కారు. డీఆర్‌వో వెంకట్రావుకు వినతి సమర్పించారు. గతేడాది అక్టోబర్‌లో ప్రభుత్వం సచివాలయ ఏఎన్ఎంలకు పదోన్నతి కల్పించే ప్రక్రియను ప్రారంభించినట్లు ప్రకటించిందన్నారు. ఈ ప్రకటనకు అనుగుణంగా అన్ని జిల్లాల్లోనూ ఈ ప్రక్రియ పూర్తి కావస్తుండగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మాత్రం కనీసం ప్రారంభం కాలేదని వెల్లడించారు. పదోన్నతుల కోసం ధ్రువపత్రాల పరిశీలన గత నెల 26 నుంచి 29 తేదీల మధ్య జరిగిందని, తదనంతరం సీనియారిటీ జాబితా నేటికీ ప్రచురించి ప్రదర్శించలేదని డీఆర్‌వో దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై డీఆర్‌వో డీఎంహెచ్‌వోను ప్రశ్నించగా, మార్కుల వెయిటేజ్, ఎస్సీ చట్టంలో క్లాసిఫికేషన్ అంశాల ప్రాతిపదికన కోర్టులో కేసు వేయడం వల్ల సీనియారిటీ జాబితాను ప్రదర్శించకుండా నిలిపామని సమాధానం ఇచ్చారు. ఆయన సమాధానంపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఏఎన్ఎంలు ఇతర జిల్లాల్లో జీవోల ఆధారంగా ప్రమోషన్ల ప్రక్రియ పూర్తి చేస్తుంటే మీకు మాత్రమే వచ్చిన అడ్డంకి ఏంటని ప్రశ్నించారు. కోర్టు సాకుతో పదోన్నతుల ప్రక్రియ చేపట్టకుండా తప్పించుకోవడం సబబు కాదని, మీ నిర్లక్ష్యం 400 మంది భవితకి నష్టమని తమ ఆవేదనను వెళ్లగక్కారు.



తమ సమస్యను నివేదించేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన ఉమ్మడి జిల్లా సచివాలయ ఏఎన్‌ఎంలు

సత్యదేవుని కల్యాణానికి ఏర్పాట్లు

- టేకు రథం ట్రయల్ రన్ విజయవంతం
- 13 వరకు పలు వైదిక కార్యక్రమాల నిలుపుదల

అన్నవరం: వైశాఖ శుద్ధ దశమి బుధవారం నుంచి వైశాఖ బహుళ పాడ్యమి వరకు జరుగనున్న సత్యదేవుని దివ్య కల్యాణ మహోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు అన్నవరం దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు తెలిపారు. సోమవారం ఆయన రత్నగిరిపై ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ మే ఎనిమిదో తేదీ, వైశాఖ శుద్ధ ఏకాదశి గురువారం రాత్రి తొమ్మిది గంటల నుంచి సత్యదేవుని దివ్య కల్యాణం జరుగుతుందని తెలిపారు.

టేకు రథం ట్రయల్ రన్ విజయవంతం

సత్యదేవుని కల్యాణ మహోత్సవాలలో ఐదో రోజు మే 11న నిర్వహించనున్న సత్యదేవుని రథోత్సవంలో ఉపయోగించే టేకు రథం ట్రయల్ రన్ సోమవారం నిర్వహించారు. రథానికి ముందు ట్రాక్టర్ కట్టి కొద్ది దూరం నడిపించారు. పెద్దాపురం ఆర్డీఓ రమణి సోమవారం రత్నగిరికి విచ్చేసి స్వామివారి కల్యాణ ఏర్పాట్ల గురించి ఈఓతో మాట్లాడారు. కల్యాణ మహోత్సవాల సందర్భంగా మే ఏడు నుంచి 13వ తేదీ వరకు స్వామివారి నిత్యకల్యాణం, ఆయుష్య హోమం, సహస్ర దీపాలంకారసేవ, పంచ హారతుల సేవ, ప్రతీ శుక్రవారం వనదుర్గ అమ్మవారికి జరిగే చండీహోమం, పౌర్ణమి నాడు జరిగే ప్రత్యంగిర హోమం, రాత్రి వేళల్లో జరిగే పవళింపు సేవ నిలుపుదల చేయనున్నట్లు తెలిపారు. స్వామివారి వ్రతాలు, ఇతర కార్యక్రమాలు యథావిధిగా జరుగుతాయి.



టేకు రథం ట్రయల్ రన్ నిర్వహిస్తున్న సిబ్బంది